మినీకథ :

# ఓ సీటు కథ

కంపార్టుమెంటు అమిత రద్దీగా వుంది.

అన్ని సీట్లూ ఆక్రమించుకోబడ్డాయి, ఒకటితప్ప. అది లోకనాథం ప్రస్తుతం తన స్వాధీనంలో వుంచుకున్నాడు. అంటే దానిమీద అతగాడు కూచున్నాడని కాదు. రైలుపెట్టెలో కిటికీ ప్రక్కనే వుండే ఓ సింగల్ సీట్‌లో అతడు కూర్చుని తన ఎదురుగుండా వున్న మరో సింగల్ సీటు పైన తన కర్చీఫ్ వేశాడు. కనుక ఆ కర్చీఫ్ వున్నంతవరకూ అది అతగాడి స్వంతమే మరి.

లోకనాథం, ఆ కంపార్టుమెంటు అంత రద్దీగా వున్నా, అలా ఆ సీటుని కర్చీఫుతో ఆక్రమించుకుని, నిర్దాక్షిణ్యంగా ఎవరికీ ఆఫర్ చెయ్యకపోవడంలో ఒక నిగూఢార్థమూ, పురుషార్థ ప్రయోజనమూ వుండక పోలేదు. అదే కంపార్టుమెంటులో గనక ఎవరేనా ఓ అందాల అతివ, పరువంలో వున్న పడుచూ గనక ఎక్కితే, ఆమెకా సీటు ఆఫర్‌చేసి తన ప్రయాణాన్ని 'కలరు' మయం చేసుకోవాలని అతడి వూహ. లోకనాథం ఉత్తిరోజుల్లో భగవంతుణ్ణి అమితంగా ప్రార్థించే అలవాటున్నందున కాబోలు లేక అతగాడు పూర్వ జన్మలో బోలెడు పుణ్యాలు చేసుకునివుండినందున కాబోలు, అతడి వూహకి అనుగుణంగా నిజంగానే ఓ పజ్జెనిమిదేళ్ళ అమ్మాయి ట్రయినెక్కింది. ఆమె తండ్రి బహుశా రైలెక్కించడానికొచ్చినట్టున్నాడు.

"జాగ్రత్తగా వెళ్ళు తల్లీ." అన్నాడా తండ్రి.

"ట్రయిను కదిలే టయిమయినట్టుంది. ఇక వుంటా నాన్నా. అబ్బా ఎంత రద్దీగా వుందో? ప్రయాణమంతా ఇలా నిలబడాలి కాబోలు."

"ఎంతమ్మా ఓ అరగంట యిలా నుంచుంటే యిట్టే కాళీ అయిపోదూ పెట్టె!"

"ఏమో బాబూ ఇలాంటి ప్రయాణాలంటే నాకు తగని చిరాకు" అంటూ ఆ అమ్మాయి తన అసహనం వెలిబుచ్చుతున్న తరుణంలో లోకనాథం లేచి కాలరు సవరించుకుని "మీకా శ్రమ లేదు మేడం. ఇదో ఈ ఎదురుసీటు మీకోసమే ఇందులో కూర్చుని హాయిగా ప్రయాణం చేయండి" అన్నాడు హీరోలా. గార్డు విజిలూదాడు.

"థాంక్స్‌అండి" అని ఆ పడుచు లోకనాథంతో అని "నాన్నా ఈ సీటు కాళీనేట! కనుక మీరింక హాయిగా ప్రయాణం చెయ్యొచ్చు వెళ్ళగానే వుత్తరం రాయడం మర్చిపోకండి. వుంటా" అని పెట్టె దిగి 'టాటా' అంటూ కదులుతూన్న రైలులోని తండ్రికి చెయ్యూపింది. లోకనాథం హతాశుడై ఆ తండ్రీ కూతుళ్ళకి జరిగిన సంభాషణ మరొక్కమారు నెమరువేసుకుని నాలిక్కరుచుకున్నాడు.

—కార్టూనిస్టు శశిధర్